తెలంగాణ
ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ గురువారం 07 - 05 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజీలు : 2

# వడ్లు కొంటలేరని రైతులు.. దళితబంధు ఇస్తలేరని దళితులు

# ఎమ్మెల్యే సామేల్‌ను నిలదీసింద్రు





- నెల రోజులవుతున్నా వడ్లు కొంటలేరని రైతుల ఆగ్రహం
- రెండున్నరేండ్లుగా మంజూరైన దళితబంధు ఆపుతున్నారని దళితుల ఆక్రోశం

**ప్రజావారధి/మోత్కూరు**

ఆరుగాలం కష్టపడి పండించి కొనుగోలు సెంటర్లలో పోసిన వడ్లను కొంటలేరని రైతులు..మంజూరైన దళితబంధును రెండున్నరేండ్లుగా ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని దళితులు బుధవారం మోత్కూరులో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌ను నిలదీశారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మోత్కూరు సింగిల్‌విండో కార్యాలయ ఆవరణలో రైతు వారోత్సవాల సమావేశం నిర్వహించగా ఎమ్మెల్యే సామేల్ హాజరయ్యారు. సింగిల్ విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు మాట్లాడుతుండగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరిచి నెల రోజులవుతున్నా వడ్లు కొనకుండా...ఈ మీటింగులు, ఉపన్యాసాలేమిటి రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరిచి నెల రోజులవుతున్నా సక్రమంగా తూకాలు వేయడం లేదని, రోజుల తరబడి పడిగాపులు పడుతూ అకాల వర్షాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తరుగు పేరుతో ఇబ్బందులు పెడుతున్నారని, లారీలు రావడం లేదని, మిల్లర్లు ధాన్యం దించుకోవడం లేదని, తమ బాధలు ఎవరూ పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యే సామేల్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్వర్లును రైతులు నిలదీశారు. రైతుల బాధలు తీర్చని ఈ మీటింగులతో ఏం ఒరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఎమ్మెల్యే, పోలీసులు కలుగజేసుకుని వారికి నచ్చజెప్పి ఎమ్మెల్యే సామేల్ యాదాద్రి కలెక్టర్ అనురాగ్ జయంతితో ఫోన్‌లో మాట్లాడారు. ధాన్యం తూకాలు కాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, అవసరమైన లారీలు పంపాలని, రైతులను ఇబ్బందులు పెట్టకుండా మిల్లర్లు ధాన్యం దించుకునేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వెంటనే సమీక్షించి అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

## దళితబంధు ఆపుతున్నారని దళితుల ఆక్రోశం

మోత్కూరు, అడ్డగూడూరు మండలాల్లో 254 మంది దళితులకు గత ఎన్నికలకు ముందు దళితబంధు మంజూరై ఖాతాల్లో జమ అయిన నిధులను డ్రా చేయకుండా అడ్డుకుంటున్నారని లబ్ధిదారులు ఎమ్మెల్యే సామేల్‌తో వాగ్వివాదానికి దిగారు. కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కోసం మోత్కూరు ఎంపీడీవో కార్యాలయంకు వచ్చిన ఎమ్మెల్యే

2లో

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
గురువారం



# ఎమ్మెల్యే సామేల్‌ను నిలదీసింద్రు





విలేకరులతో మాట్లాడుతున్న దళితబంధు లబ్ధిదారులు

**మొదటి పేజీ తరువాయి..**

సామేల్‌ను మోత్కూరు, అడ్డగూడూరు మండలాల దళితబంధు లబ్ధిదారులు కలిసి నిధులు జమ అయిన ఖాతాల ఫ్రీజింగ్ ఎత్తేసి గ్రౌండింగ్ చేయించాలని విన్నవించారు. దళిత ఎమ్మెల్యేగా ఉండి దళితుల పొట్ట కొట్టవద్దని, దళిత యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. కలెక్టర్, ఎస్సీ కార్పొరేషన్ అధికారుల వద్దకు వెళ్లి అడిగితే ఎమ్మెల్యేను కలవమంటున్నారని లబ్దిదారులు చెప్పగా తనకేం సంబంధమని, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను కలవమంటూ వెళ్లిపోయారు. ఈ సందర్భంగా లబ్దిదారులతో కలిసి బుశిపాక గణేష్‌మాదిగ విలేకరులతో మాట్లాడుతూ దళితబంధును అడ్డుకుంటున్న దళిత ద్రోహి ఎమ్మెల్యే సామేల్ అని ఆరోపించారు. రెండో విడత దళితబంధు పథకంలో భాగంగా 2023లో మోత్కూరు, అడ్డగూడూరు మండలాలకు చెందిన 254 మంది లబ్దిదారుల ఖాతాల్లో రూ.10 లక్షల నిధుల్లో రూ.3 లక్షల చొప్పున జమ చేశారని, ఈలోగా ఎన్నికల కోడ్ రావడంతో లబ్దిదారుల ఖాతాలను ఫ్రీజింగ్‌లో పెట్టారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, ఎండీ దళితబంధు లబ్దిదారుల ఖాతాల్లో జమ అయిన నిధులను గ్రౌండింగ్ చేయాలని 2025లో అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారని, కానీ యాదాద్రి జిల్లాలో అమలు చేయడం లేదన్నారు. దళిత ఎమ్మెల్యేగా దళితుల పొట్ట కొట్టవద్దని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా దళితబంధు రూ.12 లక్షలు ఇస్తామని చెప్పిందని, వెంటనే లబ్దిదారుల ఖాతాల ఫ్రీజింగ్ ఎత్తేయించి గ్రౌండింగ్ చేసి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూరెళ్ల రమేష్, బండి వెంకటేష్, దాసరి నరేష్, బుశిపాక శ్రీకాంత్, ఆనంద్, నాగరాజు, ఆనందం తదితరులు పాల్గొన్నారు.